క్లుప్తంగా

ఓటరు స్లిప్పుల పంపిణీ

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని గ్రామాల్లో ఓటరు స్లిప్పుల పంపిణీ కొనసాగుతున్నది. శనివారం ఇంటింటికీ స్లిప్పులు పంపిణీ చేశారు. సార్వత్రిక ఎన్నికలకు రెండు రోజుల ముందే స్లిప్పుల పంపిణీ పూర్తి కావాలని అధికారులు పేర్కొన్నారు. ఎంపీడీవోలు సంతోష్‌కుమార్, దామోదర్, శ్రీనివాస్ పర్యవేక్షించారు.

నిబంధనలు పాటించాలి

ఆర్మూర్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ఎన్నికల పరిశీలన అధికారి సుబ్రాచక్రవర్తి అన్నారు. పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఓటరు స్లిప్పుల పంపిణీని సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆర్వో వినోద్‌కుమార్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాలు

మాక్లూర్: విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాలలో టాటా క్రీప్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రాంగణ నియామకాలు మొత్తం 22 మంది విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. ఎంపికైన వారిని ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్, కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి, సెక్రటరీ డాక్టర్ అమృతలత, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గణేశ్ అభినందించారు. అధ్యాపకులు, పీఆర్‌వో వాసుగౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఖర్చుల రిజిస్టర్ పరిశీలన

ఆర్మూర్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల ఖర్చుల వివరాల రిజిస్టర్‌ను పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో ఎన్నికల వ్యయ పర్యవేక్షణ అధికారి సమక్షంలో పరిశీలించనున్నట్లు రిటర్నింగ్ అధికారి వినోద్ కుమార్ శనివారం తెలిపారు. ఈనెల 19న, 23న, 27న ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరిశీలిస్తామన్నారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలు తెలుసుకోవాలంటే ఒక పేజీకి ఒక రూపాయి చొప్పున చెల్లించి తీసుకోవాలన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

నవీపేట : మండలంలోని కమలాపూర్ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటువేసినట్లు ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ శనివారం తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ తన విధులను నిర్లక్ష్యం చేయడంతోపాటు కూలీలకు పని కల్పించడంలో అలసత్వం ప్రదర్శించారన్నారు. పీడీ చందర్‌నాయక్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

దంత వైద్యశిబిరం

వేల్పూర్: మండలంలోని పడగల్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్ఎస్ మల్టీ స్పెషాలిటీ దంతవైద్యశాల వైద్యులు విద్యార్థులకు శనివారం దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. డాక్టర్ సాధన సంపాల్, రోటరీ క్లబ్ కార్యదర్శి పట్వారి తులసీ, పుష్పాకర్‌రావు, ప్రవీణ్‌పవార్, సురేశ్‌కుమార్, ఉపాధ్యాయులు విజయ్, జలంధర్, నారాయణ, గంగామోహన్, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్స్ అందజేత

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పట్టణానికి చెందిన గుండేటి బాల్‌రెడ్డి శనివారం వాలీబాల్స్‌ను అందజేశారు. హెచ్ఎం హరిత, ఉపాధ్యాయురాలు గీత, పీఈటీ మధుసూదన్ యాదవ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మాక్ పోలింగ్

పెర్కిట్(ఆర్మూర్): మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి నలంద హైస్కూల్‌లో హెడ్‌బాయ్, హెడ్ గర్ల్స్ ఎంపిక కోసం శనివారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. హెడ్‌బాయ్‌గా సింగారం లిఖిత్, హెడ్ గర్ల్‌గా పావని ఎన్నికయ్యారు. స్కూల్‌యాజమాన్యం నలంద ప్రసాద్, నలంద సాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాల్వలకు వందలకోట్లు వెచ్చించాం

- రోడ్ల వెడల్పునకు నిధులిచ్చాం
- బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం, సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం
- ఎన్నికల ప్రచారంలో మంత్రి హరీశ్‌రావు



సాటాపూర్‌లో హరీశ్‌రావు, షకీల్‌ను గజమాలతో సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నందిపేట్‌లో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు



సాటాపూర్‌లో సభకు హాజరైన జనం

రెంజల్(బోధన్)/మాక్లూర్/నందిపేట్(ఆర్మూర్): నిజాంసాగర్ చివరి ఆయకట్టు నియోజకవర్గమైన బోధన్ అభివృద్ధి గురించి ఎమ్మెల్యే షకీల్ తన దృష్టికి తీసుకు వస్తే సాగర్ కాల్వల ఆధునికీకరణ పనులకు వందల కోట్ల రూపాయలు మంజూరు చేశామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. బోధన్, ఆర్మూర్ నియోజకవర్గాల పార్టీ అభ్యర్థులు షకీల్, జీవన్ రెడ్డికి మద్దతుగా శనివారం ఆయన ఎన్నిల ప్రచారం నిర్వహించారు. రెంజల్ మండలం సాటాపూర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాదసభలో మాట్లాడుతూ.. గతంలో నీళ్ల మంత్రిగా పనిచేసిన బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలు, రైతులకు అన్యాయం చేశారన్నారు. ఆయన హయాంలో కనీసం తాగేందుకు నీరు, పంటలకు సాగునీరందించలేదని విమర్శించారు. బోధన్–నిజామాబాద్ రోడ్డు వెడల్పునకు రూ.30 కోట్లు, నవీపేట్‌లో పాలిటెక్నిక్ బిల్డింగ్‌కు రూ. 6.5 కోట్లు, జాన్కంపేట్ నుంచి బాసర సరస్వతీ ఆలయం వరకు రోడ్డు వెడల్పునకు రూ. 55 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నంత కాలం తెలంగాణ రాష్ట్రం, బీఆర్ఎస్ పార్టీ సెక్యులర్‌గానే ఉంటాయని మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ముస్లింల పేదరికానికి కాంగ్రెస్సే కారణమని ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ పేదరికం ఇస్తే.. సీఎం కేసీఆర్ వారి ఇళ్లలో వెలుగులు నిపుతున్నారన్నారు. మైనార్టీలను డాక్టర్లు, ఇంజినీర్లు, కలెక్టర్లు, ప్రభుత్వ ఉద్యోగులుగా ఎదిగేందుకు కృషి చేస్తున్నారన్నారు. షకీల్ మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు ద్వారా పెద్ద మొత్తంలో నిధులు తీసుకువచ్చి బోధన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు.

మాక్లూర్, నందిపేట్ మండలాల్లో ప్రచారం

ఆర్మూర్ నియోజకవర్గ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి మద్దతుగా మంత్రి హరీశ్‌రావు మాక్లూర్ మండలం మానిక్‌బండార్, నందిపేట మండల కేంద్రంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల మాట్లాడారు. జీవన్‌రెడ్డికి లభిస్తున్న ప్రజాదరణను చూసి బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు కంటిమీద కునుకులేకుండా పోయిందన్నారు. రెండు పర్యాయాలు గెలిపించినందుకు జీవన్‌రెడ్డి ఆర్మూర్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసి చూపించారన్నారు. మున్ముందు మరింత సేవ చేసేందుకు మీ ముందుకు వస్తున్న జీవన్‌రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాక్లూర్ మండల పార్టీ అధ్యక్షుడు బడుగు సత్యం, ఎంపీపీ మాస్త ప్రభాకర్, ఆకుల రజనీష్, అగ్రమాద్ విండో చైర్మన్ ఏనుగంటి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్డీఎస్ఎల్‌ను తెరిపిస్తాం

- బోధన్ బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి



ఎడపల్లిలో మాట్లాడుతున్న వడ్డి మోహన్‌రెడ్డి

ఎడపల్లి(బోధన్): బోధన్ చక్కెర ఫ్యాక్టరీని మూసివేయించిన ఘనత బీఆర్ఎస్, కాంగ్రెస్‌కే దక్కుతుందని బోధన్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని అన్నారు. ఎడపల్లి మండలం అంబం (వై), ఏఆర్పీ క్యాంపు, దుబ్బతండా, బ్రాహ్మణపల్లి, జైతాపూర్, ఎంఎస్‌సీ ఫారం, ధర్మారం, వడ్డేపల్లి, మంగళపహాడ్ గ్రామాల్లో మోహన్‌రెడ్డి శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధన్ ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు గెలుపొందిన షకీల్, మూడు పర్యాయాలు గెలుపొందిన మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి ఎడపల్లి మండల అభివృద్ధికి చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. బీఆర్ఎస్ నిరంకుశపాలనపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు బీజేపీకి ఓటువేస్తే కలిగే లాభాలను వివరించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మేక సంతోష్, ఎడపల్లి మండల అధ్యక్షుడు కోల ఇంద్రకరణ్, బోధన్ అసెంబ్లీ కన్వీనర్ కూరెళ్ల శ్రీధర్, నాయకులు, వివిధ గ్రామాల ప్రధానకార్యదర్శులు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా బిల్లు గర్వకారణం



మాట్లాడుతున్న ఏలేటి అన్నపూర్ణమ్మ

భీమ్‌గల్ : మహిళల సమానత్వం కోసం ప్రధాని నరేంద్రమోదీ మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించడం దేశ మహిళలకు గర్వకారణమని బాల్కొండ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. మండలంలోని దేవక్కపేట్‌లో అన్నపూర్ణమ్మ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ నాయకులు కర్ణాటక ప్రజలను మోసం చేసినట్లు, తెలంగాణ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులకు కాకుండా బీఆర్ఎస్ కార్యకర్తలకు ఇచ్చి సామాన్యులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటేనని, ఆ రెండు పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బాల్కొండలో బీజేపీని గెలిపిస్తే ఎన్నో అభివృద్ధి పనులు చేసుకోవచ్చని ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్, మండల అధ్యక్షుడు ములిగే మహిపాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



వేంపల్లిలో మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి



మంత్రికి స్వాగతం పలుకుతున్న వేంపల్లి గ్రామస్తులు

బాల్కొండ: సీఎం కేసీఆర్ అండతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టానని, మీ కళ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు. ముప్కాల్ మండలం వేంపల్లి, కొత్తపల్లి, నల్లూర్ గ్రామాల్లో ప్రశాంత్‌రెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోతల కారణంగా రైతులు ఎంత గోసపడ్డారో ప్రజలు అపుడే మరిచిపోలేదన్నారు. కేవలం అధికారంలోకి రావాలనే కాంక్షతో అబద్ధపు హామీలను ఇస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రూ.2 వేల పింఛన్ ఇవ్వడం లేదని, కానీ ఇక్కడ అధికారంలోకి వస్తే రూ.4 వేల పింఛన్ ఇస్తామని అబద్ధపు హామీలు ఇస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో తారు రోడ్లు , సీసీ రోడ్లు, హెల్త్ సెంటర్ భవనాలను ఇలా అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నియోజకవర్గం కోసం రూ.6,500 కోట్ల నిధులు తీసుకువచ్చామన్నారు. అబద్ధపు హామీలను నమ్మి ఓటువేస్తే ఆగమవుతారన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను మూడోసారి దీవించాలని కోరారు. మంత్రికి ఆయా గ్రామాల ప్రజలు వలగొడుగు, బోనాలతో ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ సామపద్మ, జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ, హెల్త్ అండ్ ఫ్యామిలీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

ముప్కాల్ మండలం కొత్తపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జైడి రవి ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను గెలిపించండి

- ముత్యాల సునీల్‌కుమార్



అక్లూర్‌లో మాట్లాడుతున్న ముత్యాల సునీల్



పార్టీలో చేరిన వారితో సునీల్

వేల్పూర్: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌ను ఈ ఎన్నికల్లో గెలిపించాలని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌కుమార్ కోరారు. వేల్పూర్ మండలం అక్లూర్, అంక్సాపూర్, లక్కోర గ్రామాల్లో సునీల్ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల బలమైన కోరకగా ఉన్న ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీకి బహుమానంగా తెలంగాణాలో కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వరి పంటకు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, పెట్టుబడి సహాయం ఎకరానికి రూ. 15 వేలు, భూమిలేని రైతు కూలీలకు ప్రతిఏటా రూ.12 వేలు, మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు రూ.2500, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, చేయూత ద్వారా రూ.4 వేల పింఛను, రూ.10 లక్షల ఆరోగ్య పథకం అమలు చేస్తుందన్నారు. నియోజకవర్గంలో అహంకారాన్ని అంతమొందించి ప్రేమను గెలిపించాలని కోరారు. ఒక్కసారి అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, మాజిద్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

భీమ్‌గల్/మోర్తాడ్: ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ మాజీ సర్పంచ్ కోటగిరి రామాగౌడ్, భీమ్‌గల్ మండలం పల్లికొండకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ముత్యాల సునీల్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో కీలక నాయకుడిగా ఉన్న రామాగౌడ్ కాంగ్రెస్‌లో చేరడం సంతోషంగా ఉందని సునీల్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ ప్రజలు అరాచకానికి వ్యతిరేకంగా మార్పు కోరుకుంటున్నారని, అహంకారాన్ని ఓడించి ప్రేమను గెలిపించుకోవాలనుకుంటున్నారని అన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా కష్టపడి కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఏర్గట్ల మండల నాయకులు దేవారెడ్డి, గంగాప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి



పాతంగల్‌లో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నవీపేట: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించి అధికారాన్ని చేపడుతుందని ఆ పార్టీ బోధన్ నియోజకవర్గ అభ్యర్థి పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని నాడాపూర్, గాంధీనగర్, హనుమాన్‌ఫారం, పాతంగల్, యంచ గ్రామాల్లో శనివారం సుదర్శన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. రెండుసార్లు అధికారాన్ని చేపట్టిన బీఆర్ఎస్ అభివృద్ధిని విస్మరించి అవినీతికి పెద్దపీట వేసిందని ఆరోపించారు. అన్ని పథకాల్లో కమీషన్లకు కక్కుర్తిపడ్డారని విమర్శించారు. రైతుల ధాన్యం డబ్బులు కాజేసిన ఎమ్మెల్యే షకీల్‌పై ఎలాంటి చర్యలు లేవని, ఇసుక, మొరం మాఫియాలో షకీల్ కీలకపాత్ర పోషించారని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలను పెంచిన కేంద్ర ప్రభుత్వం పేదలపై తీవ్రభారాన్ని మోపిందన్నారు. బీఆర్ఎస్, బీజేపీకి ఓటువేసి మరోసారి మోసపోవద్దని సూచించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాల అమలుకు పెద్దపీట వేస్తుందని, చెయ్యి గుర్తుకు ఓటేయాలని కోరారు. పార్టీ నాయకులు సుధాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, రాంచందర్, గోవర్ధన్‌రెడ్డి, గోపాల్, బాబు, మూస, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు

- ఎన్నికల ప్రచారంలో ఎంపీ ధర్మపురి అర్వింద్



నందిపేటలో అభివాదం చేస్తున్న ఎంపీ అర్వింద్, బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి

నందిపేట్/మాక్లూర్(ఆర్మూర్): కేసీఆర్ పాలనలో ప్రజలు కష్టాలపాలయ్యారని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి దోచుకున్న వాళ్లకు బుద్ధిచెప్పే సమయం ఆసన్నమైందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఆర్మూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డికి మద్దతుగా నందిపేట మండల కేంద్రంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో అర్వింద్ మాట్లాడుతూ.. మరోసారి బీసీలపై కుట్ర చేసేందుకు రేవంత్‌రెడ్డి యత్నిస్తున్నారన్నారు. నిజామాబాద్ ప్రజలు ఓట్లతో బుద్ధిచెప్పినప్పటికీ.. ఎమ్మెల్సీ కవిత ప్రజల్లోకి ఎలా వస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను బీఆర్ఎస్ ఇస్తున్నట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఆర్మూర్ నియోజకవర్గం గంజాయి, రౌడీయిజానికి కేరాఫ్‌గా మారిందని ఆరోపించారు. ఎమ్మెల్యేగా జీవన్‌రెడ్డికి రెండుసార్లు అవకాశం ఇచ్చినా అభివృద్ధి కోసం ఎన్నడూ పాటుపడలేదన్నారు. తాను గెలిచిన వెంటనే ఏడాదిలోపు ఇండ్ల నిర్మాణం చేపడుతానని, నిర్మించకపోతే తాను రాజీనామా చేస్తానని హామీ ఇచ్చారు. తన వాళ్లకు ఎలాంటి హాని కలిగినా ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, కౌన్సిల్ మెంబర్ విజయ భారతి, కంచెట్టి గంగాధర్, యామాద్రి భాస్కర్ పాల్గొన్నారు.

మాదాపూర్‌లో..

ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపుతానని రాకేశ్‌రెడ్డి అన్నారు. మాక్లూర్ మండలం మాదాపూర్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జీవన్‌రెడ్డిని నమ్మి గెలిపిస్తే అభివృద్ధి పేరుతో అందినకాడికి దోచుకున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను నమ్మితే మళ్లీ అదే గతి పడుతుందన్నారు. అంతకుముందు గ్రామస్తులు డప్పువాయిద్యాలు, మహిళలు మంగళహారతులతో రాకేశ్‌రెడ్డికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేశ్‌నాయక్, మండల సీనియర్ నాయకులు గంగోనే సంతోష్, మేతరి రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాస్వామికవాదులను గెలిపించాలి

బోధన్: ఎన్నికల్లో ప్రగతిశీల, ప్రజాస్వామిక వాదులను గెలిపించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు వి ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో శనివారం నియోజకవర్గ స్థాయి పార్టీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ ప్రభుత్వాలు నియంతృత్వ పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. మతాన్ని అడ్డం పెట్టుకుని బీజేపీ, ఎంఐఎం, ప్రాంతీయతత్వంతో బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. జిల్లా, డివిజన్ ప్రతినిధులు కె గంగాధర్, బీ మల్లేశ్, సుల్తాన్, సాయిలు, నాగమణి, పాషా పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్




పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – టైగర్ 3 (తెలుగు)- 10.05
స్పార్క్ లైఫ్ (తెలుగు)-1.30, 10.30
మా ఊరి పొలిమేర-2(తెలుగు) - 5.00
కీడా కోలా(తెలుగు) - 7.50
స్క్రీన్-2 – మంగళవారం (తెలుగు)- 10.00, 1.10, 4.20, 7.30, 10.40
స్క్రీన్-3 – అన్వేషి (తెలుగు)- 10.00
సప్త సాగరాలు(తెలుగు)- 12.50, 4.00, 7.10
టైగర్-3 (తెలుగు)- 10.20
స్క్రీన్-4 – టైగర్-3 (తెలుగు)- 11.15, 2.40, 6.05, 9.30

పాఠశాలల సందర్శన

బోధన్ రూరల్/రెంజల్ (బోధన్): బోధన్ మండలం కల్దుర్కి జిల్లా పరిషత్ ఉన్నత, రెంజల్‌లోని ఆదర్శ పాఠశాలలను రాష్ట్ర పరిశీలకులు సంజీవ్ శనివారం సందర్శించారు. ఉన్నతి, లక్ష్య కార్యక్రమంలో భాగంగా పాఠశాల సందర్శించిన ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి బోధన తీరును తెలుసుకున్నారు. ఆయనవెంట సీఎంఓ శ్రీనివాస్, మండల నోడల్ అధికారి నాగయ్య, ఆదర్శపాఠశాల ప్రిన్సిపల్ బలరాం, ఉపాధ్యాయులు హనుమంతు, అంబెల్లి శంకర్, సీఆర్‌పీలు బాబు, గంగారాం ఉన్నారు.

ఫ్రిజ్ వితరణ



వర్ని (మోస్రా) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌కు మోస్రా కెనరా బ్యాంకు అధికారులు ఫ్రిజ్‌ను శనివారం అందజేశారు. బ్యాంకు మేనేజర్ గిరిధర్, అసిస్టెంట్ మేనేజర్ హర్ష, ఉపాధ్యాయులు మాణిక్‌రావు, శ్రీనివాస్, సంజీవ్ పాల్గొన్నారు.

పాదుకలకు పూజలు



వర్ని: అయోధ్య రాములవారి పాదుకలకు మండలంలోని శ్రీనగర్, సత్యనారాయణపురం గ్రామాల్లో శనివారం పూజలు చేసి ఊరేగింపు నిర్వహించారు. పాదయాత్ర ద్వారా తీసుకువచ్చిన పాదుకలకు శ్రీనగర్ రామాలయం, సత్యనారాయణపురం రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

బీఆర్ఎస్, బీజేపీల్లో చేరికలు

సాక్షి నెట్‌వర్క్: కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లికి చెందిన 200 మంది మహిళలు బాల్కొండ బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ సమక్షంలో బీజేపీలో చేరారు. బాల్కొండ నియోజకవర్గంలోని కాంగ్రెస్, బీజేపీకి చెందిన పలువురు నాయకులు మంత్రి ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆర్మూర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుజరాతి వినోద్, సుద్దాల సతీశ్ ఎమ్మెల్యే అభ్యర్థి రాకేశ్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. కాంగ్రెస్ నాయకుడు, వర్ని మాజీ జెడ్పీటీసీ రంజ్యానాయక్ బాన్సువాడ నియోజకవర్గ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

దుప్పట్లు పంపిణీ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని లాలన వృద్ధాశ్రమం వృద్ధులకు రోటరి క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు, వాకర్ స్టాండ్లు, పండ్లు అందజేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పట్వారి గోపీకృష్ణ, పట్వారి తులసీకుమార్, కోశాధికారి లక్ష్మీనారాయణ, సభ్యులు పుష్పాకర్‌రావు, ప్రవీణ్‌పవార్, గోసే దామోదర్, వన్నెల్‌దాస్ రాము పాల్గొన్నారు.